వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి సంక్షేమం బాట పట్టాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కొటికలపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండోరోజు మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక సమస్యలతో నిలిచిన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.4.22కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే వసంత తెలిపారు. .జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి, ఎంపీపీ జోత్స్న, మండల కన్వీనర్ సాంబశివరావు, సచివాలయ కో–ఆర్డినేటర్ అంకమోహనరావు దుర్గగుడి ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నాగమణి, సర్పంచ్ నాగరాజు, పీఏసీఎస్ శివారెడ్డి, జానీ, దుర్గాప్రసాద్, చిన్నయ్య, దుర్గారావు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు.

అర్థ రహిత విమర్శలు మానుకోవాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



కేక్ కట్ చేస్తున్న రక్షణనిధి, నాయకులు

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతిపక్ష నేతలు వక్రభాష్యం చెబుతున్నాయని ఎమ్మెల్యే రక్షణనిధి విమర్శించారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు విశాఖ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరై రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూలు కుదుర్చుకుంటే ప్రతిపక్ష నేతలు సహించలేకపోతున్నారన్నారు. తిరువూరు నియోజకవర్గంలో కూడా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. ఇక్కడి సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైనందుకు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు మండల పరిషత్ అధ్యక్షులు గద్దల భారతి, శ్రీలక్ష్మి, వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యులు రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, గన్యా, శామ్యూల్, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు మోహనరెడ్డి, సత్యనారాయణ, నాగేశ్వరరావు, నగరపంచాయతీ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- **నేడు మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**

ఇబ్రహీంపట్నం: మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరుగుతుంది. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికతో కలసి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొంటారు.

ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందడుగు వేయాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి



జడ్జి దుర్గాకల్యాణిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట రాము



తిరువూరు కోర్టులో మహిళా న్యాయవాదులు, ఉద్యోగులకు సన్మానం

నూజివీడు: మహిళలకు అన్ని రంగాల్లో రాణించగల సత్తా ఉందని, ఆత్మ విశ్వాసం, పట్టుదల, ధైర్య సాహసాలు, నిరంతర కృషి ఎంతో అవసరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డీ దుర్గాకల్యాణి అన్నారు. పట్టణంలోని కృష్ణాయూనివర్సిటీ కాలేజీ ఆఫ్ పీజీ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య వీ వెంకట రాము అధ్యక్షతన మంగళవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్నినిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మదర్‌థెరిసా, సావిత్రిబాయిపూలే వంటి వారి జీవిత విశేషాలను తెలుసుకుని వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం జడ్జి దుర్గాకల్యాణిని ఘనంగా సత్కరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ షేక్ అన్వర్‌బాషా, నాగరాజు, మహిళా అధ్యాపకులు శివపార్వతి, బిందు మాధవి, శ్రీదేవి పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతులు

చాట్రాయి: మహిళలు అన్ని రంగాల్లో అగ్రస్థానాల్లో నిలబడుతున్నారని మండలంలోని ఆరుగొలనుపేట యూపీ స్కూలు హెచ్ఎం కె.నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక స్కూల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు వి.రాధామాధవి, శ్రీలక్ష్మీ, కె.స్వర్ణకుమారి, బి.మౌనికను సన్మానించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

తిరువూరు: మహిళలు అన్ని రంగాల్లో గల అవకాశాలను అందిపుచ్చుకోవాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం శివకిరణ్ అన్నారు. స్థానిక స్వధార్ షార్ట్ స్టే హోంలో మహిళా దినోత్సవ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కుమార్, ఆనందస్వరూప్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం తిరువూరు కోర్టు ఆవరణలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో మహిళా న్యాయవాదులను సన్మానించారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఆగిరిపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ గోళ్ల అనూషా ఇసాక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆగిరిపల్లి భాగ్యలక్ష్మీ ఇండేన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు పీవీ శ్రీనివాసరావు, ఆనంద మహిళా మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు సంధ్యానాని ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ కె.వాణి పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం మహిళా ఉద్యోగులను సన్మానించారు. తహసీల్దారు సురేష్‌బాబు, వీఆర్వోలు మహిళా ఉద్యోగుల సేవలను అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా అధ్యాపకులను ప్రిన్సిపాల్ మురళీకృష్ణ సన్మానించారు.

హక్కులపై అవగాహన ఉండాలి

మైలవరం: మహిళల హక్కులు, చట్టాలు, సాధికారతపై అవగాహన ఉండాలని జడ్జి షేక్ షిరీన్ తెలిపారు. మైలవరం వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా మైలవరం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వారం రోజులు మహిళల హక్కులు, చట్టాలపై అవగాహనా సదస్సు మంగళవారం ప్రారంభించారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులను మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు అనితకుమారి, టి.నాగశ్రీ, ఎ.శ్రావణి, ఎస్.లావణ్య, సీహెచ్ఓ సుల్తాన పాల్గొన్నారు.

హోలీ సంబరాలు



హోలీ వేడుకలో విద్యార్థులు

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ ఎంపీ యూపీ పాఠశాలలో విద్యార్థులు హోలీ సంబరాలను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ పండగ గురించి హెచ్ఎం జయరామ్ విద్యార్థులకు వివరించారు.

ఇబ్రహీపట్నంలో..

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో హోలీ పండగను మంగళవారం జరుపుకున్నారు. సుగాలీ కాలనీలు కలిగిన గుంటుపల్లి, కిలేశపురం పశ్చిమ ఇబ్రహీంపట్నంతో పాటు కొండపల్లి ఐడీఏలో కార్మికులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. కిలేశపురంలో వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ సుగాలీలతో కలసి రంగులు ఉత్సవంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్యవసాయ ఉత్పత్తులు



ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వ్యవసాయశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ ఉత్పత్తుల, పౌష్టికాహార ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి మంగళవారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తాము పండించిన 310 రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. భక్తుల ఆయా ఉత్పత్తులను విశేషంగా తిలకించారు. ఆలయకమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి. శ్రీరామవరప్రసాదరావు, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు వినయ్‌కుమార్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి సాయిశ్రీ, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహార స్టాల్

తిరువూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాల తయారీ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా స్టాల్ కొనసాగింది.

కోలాహలంగా ఆటల పోటీలు

నెమలి(గంపలగూడెం): వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు మంగళవారం కోలాహలంగా జరిగాయి. జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన పోటీలను తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి ప్రారంభించారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామిని తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు పట్టు వస్త్రాలు, స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు అందజేశారు.

సంక్షిప్తం

- **వైభవంగా శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం**

తిరువూరు: స్థానిక రాజుపేటలోని అష్టలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా అష్టలక్ష్మీదేవికి జరిపిన విశేషపూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు మురుకుంట్ల సీతారామలింగేశ్వరశర్మ, పద్మనాభశర్మల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఇటీవల పునఃప్రతిష్ఠించిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి ఆలయంలో స్వామి కల్యాణాన్ని నిర్వహించారు.

- **భూముల పరిశీలన**

నూజివీడు: నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు వెళ్లే మార్గంలో మలుపుల వద్ద భూసేకరణ నిమిత్తం సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మంగళవారం భూమిని పరిశీలించారు. నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లి రోడ్డులోని బైపాస్ సమీపంలో మలుపును, అలాగే ముసునూరు మండలం సింహాద్రిపురం వద్ద ఉన్న మలుపులో రోడ్డును వెడల్పు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో సేకరించాల్సిన భూమిని సబ్‌కలెక్టర్ పరిశీలించడంతో పాటు ఎంత భూమి అవసరం, మార్కెట్ వాల్యూ ఎంత ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు, నూజివీడు, ముసునూరు తహసీల్దార్లు యల్లారావు, సుధ పాల్గొన్నారు.

- **రైతుల సంక్షేమం కోసం కృషి**

మైలవరం: రైతుల సంక్షేమం కోసం తాను పని చేస్తానని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తనపై నమ్మకంతో రైతు విభాగం బాధ్యతలు అప్పగించారన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.

- **పోతురాజు శేషగిరిరావు విగ్రహావిష్కరణ**

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ నాయకుడు పోతురాజు శేషగిరిరావు(శేషయ్య) ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ శేషగిరిరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేషగిరిరావు కుమారులు మాధవ, గోపి, సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, సొసైటీ చైర్మన్ ఎల్.పుండరీకవర్మ పాల్గొన్నారు.

- **అచ్చం పేరంటాళమ్మకు అభిషేకం**

పేరంటాళ్లగుట్ట(గంపలగూడెం): వినగడప శివారు పేరంటాళ్లగుట్ట వద్ద విరాజిల్లుతున్న అచ్చం పేరంటాళమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం కనులవిందుగా అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.

- **మజ్జిగ పంపిణీ**

నెమలి(గంపలగూడెం): వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా తిరువూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కే వినయ్‌కుమార్, యాదవ సంఘం అధ్యక్షులు వీ.లక్ష్మీనారాయణ పంపిణీని ప్రారంభించారు.

- **బాధితులకు అట్లూరి ట్రస్టు సాయం**

నూజివీడు: పట్టణంలోని రామాయమ్మరావుపేటలో ఇటీవల అగ్నిప్రమాదంలో బత్తుల నాగేశ్వరికి చెందిన పూరిల్లు దగ్ధమై కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ నేపథ్యంలో అట్లూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ అట్లూరి రవీంద్ర మంగళవారం కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రెండు జతల నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే 25 కిలోల బియ్యం, వంట సామగ్రి, కొంత నగదును బాధితులకు ఇచ్చారు.

- **మంత్రి జోగి రమేష్‌ను కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు**

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఆర్టీసీ డిపో వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డిపోలో ఎదురవుతున్న సమస్యలు, ఉద్యోగుల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో సంప్రదించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారు.

- **ఉపాధి హామీ పనుల పరిశీలన**

ఎ.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం కాకుండా కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లమందల గ్రామంలో మంగళవారం ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.

- **కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం**

నూజివీడు: ప్రతి ఒక్కరూ కిడ్నీ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలను పాటించడం ద్వారా కిడ్నీలను సంరక్షించుకోవచ్చని నూజివీడు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర సింగ్ అన్నారు. వరల్డ్ కిడ్నీ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు, డయాలసిస్ సెంటర్ సిబ్బంది మంగళవారం పట్టణంలో కిడ్నీ వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. అపోలో డయాలసిస్ ఆపరేషనల్ మేనేజర్ మధుకిరణ్ పాల్గొన్నారు.

- **కనుల పండువగా కల్యాణం**

ముసునూరు: లోపూడి శివారు బాసవరప్పాడులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మల కల్యాణాన్ని, ముసునూరులోని చారిత్రక వెంకటాచల స్వామి వార్ల కల్యాణాన్ని మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏడు వేల మందికి అన్నదానం చేశారు.